## క్లుప్తంగా

### మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడం, వేసవి సెలవుల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి నామసంకీర్తనలు, భక్తులు ఏర్పాటు చేసిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

### ఘనంగా సహస్రనామ కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహిక సహస్రనామ కుంకుమార్చన చేశారు. అర్చకులు పురాణం శేషాచార్యులు, ముప్పిరాల అనంతాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.బంగారురాజు పాల్గొన్నారు.

### డెబిట్, క్రెడిట్ కార్డుల నుంచి నగదు స్వాహా

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటకు చెందిన కోటంశెట్టి నవీన్ అనే వ్యక్తి డెబిట్, క్రెడిట్ కార్డుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు స్వాహా చేశారు. బాధితునికి స్థానిక బైపాస్ రోడ్డులోని ఏక్సిస్ బ్యాంకులో ఖాతా ఉంది. ఈ నెల 23న ఒక అగంతకుడు నవీన్‌కు ఫోన్ చేసి తాను బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పి ఖాతా వివరాలు సరిచేయాలన్నాడు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు, ఖాతాల వివరాలు చెప్పడంతో నవీన్‌కు నమ్మకం ఏర్పడి అగంతకుడు అడిగిన ఓటీపీ నంబర్ చెప్పడంతో క్రెడిట్ కార్డు నుంచి రూ.44 వేలు కట్ అయింది. దీంతో లబోదిబోమన్న బాధితుడు బ్యాంకు సిబ్బంది, భీమిలి పోలీసులు, సైబర్ క్రైం సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా శనివారం మళ్లీ నవీన్ డెబిట్ కార్డు నుంచి రూ.186తో ఫోన్ రీచార్జ్ చేసుకున్నట్టు మరొక మెసేజ్ రావడంతో ఖంగుతిన్నాడు. వెంటనే బ్యాంకు ఖాతాలను క్లోజ్ చేసుకున్నాడు.

# రేపటి నుంచి సుత్తమ్మతల్లి ఉత్సవాలు

తగరపువలస : కొలిచిన భక్తుల కొంగు బంగారమై పూజలందుకుంటున్న భీమిలి మండలం చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల గ్రామదేవత సుత్తమ్మతల్లి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలకు 300 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉంది. అప్పట్లో విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచి అమ్మవారు ఈ ప్రాంతానికి వచ్చి వెలసినట్టు పూర్వీకులు కథలుగా చెప్పుకునేవారు. తనను నమ్ముకున్న చిప్పాడ గ్రామ ప్రజలను ఆమె రక్షించిన తీరు తలచుకుంటేనే భక్తిభావం ఉప్పొంగుతుంది. గ్రామదేవతలకు మంగళవారం రాత్రి అనుపోత్సవాలు నిర్వహిస్తే చిప్పాడలో మాత్రం బుధవారం మధ్యాహ్నం అనుపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండేళ్లకోసారి కన్నుల పండువగా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాణసంచా, మంగళవారం రథోత్సవం, బుధవారం మిట్ట మధ్యాహ్నం అనుపోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉన్నందున సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, బాణసంచాలపై ఆంక్షలు ఉన్నాయి.



సుత్తమ్మతల్లి



చిప్పాడలో సుత్తమ్మతల్లి ఆలయం

**తొలి సంతానానికి అమ్మవారి పేరు..**

చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల పరిధిలోని 18 గ్రామాలకు చెందిన ప్రజలు తమ తొలి సంతానానికి అమ్మవారి పేరు పెట్టుకుంటారు. సుత్తియ్య, సుత్తమ్మ, సుత్తప్ప, సుత్తినాయుడు, చిట్టిబాబు, చిట్టెమ్మ, చిట్టిరెడ్డి వంటి పేర్లు పెట్టుకుంటారు. ఇవే పేర్లు ఎక్కువ మందికి ఉన్నప్పుడు వాటి ముందు పెద్ద, చిన్న లేదా తండ్రి పేర్లు చేర్చుకుంటారు. మరికొందరు మొక్కు కోసం అమ్మవారి పేరు పెట్టి తర్వాత మరో పేరు పెట్టుకోవడం ఇటీవల ఆనవాయితీగా మారింది.

# ఎంపీఎల్ లీగ్ విజేత ఎండాడ హెచ్‌సీపీ - 11 జట్టు



ట్రోఫీతో ఎండాడ హెచ్‌సీపీ - 11 క్రికెట్ జట్టు సభ్యులు

పీఎం పాలెం : వారం రోజులుగా వైఎస్సార్ క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్‌లో జరిగిన మధురవాడ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ క్రికెట్ పోటీలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పోటీల్లో 8 జట్లు పాల్గొనగా శనివారం మధ్యాహ్నం ఫైనల్‌లో ఎండాడ హెచ్‌సీపీ - 11 క్రికెట్ జట్టు మధురవాడ రాక్ స్టార్ జట్టుపై విజయం సాధించింది. ఎండాడ హెచ్‌సీపీ - 11 జట్టు ట్రోఫీతోపాటు రూ.2 లక్షల నగదు బహుమతి పొందింది. రన్నర్‌గా నిలిచిన మధురవాడ రాక్ స్టార్ జట్టు లక్ష రూపాయల నగదు బహుమతి అందుకుంది. ముగింపు కార్యక్రమంలో నక్కా శ్రీధర్, వాండ్రాసి రవికుమార్, పిళ్లా సత్యనారాయణ, గురునాథ్, కొర్రాయి సురేష్, పోతిన అప్పలరాజు, జగ్గుపిల్లి సురేష్, మామిడి దుర్గారావు, పసుపులేటి రామ్ పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

తగరపువలస : ఆనందపురం మండలంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు వ్యవసాయాధికారిణి చావా సంధ్యారత్నప్రభ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. మండల పరిధిలో జీలుగు 16.2 క్వింటాళ్లు (కిలో రూ.44), జనుము 7.5( కిలో రూ.44), పిల్లిపెసర 3.6 క్వింటాళ్లు (కిలో.67) అందుబాటులో వుందని తెలిపారు.

**రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు**

పద్మనాభం : రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సరఫరా చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ సింహాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుమ పది కిలోల అసలు ధర రూ.880 కాగా సబ్సిడీపై రూ.440కు, జీలుగు పది కిలోల అసలు ధర రూ.880 కాగా సబ్సిడీపై రూ.440కు, పిల్లి పెసర ఎనిమిది కిలోల అసలు ధర రూ.1072 కాగా సబ్సిడీపై రూ.536కు రైతులకు సరఫరా చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

**ధాన్యం విత్తనాలకు ప్రతిపాదనలు :** ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే 1262.18 క్వింటాళ్ల ధాన్యం విత్తనాల కోసం ప్రతిపాదనలు తయారుచేసి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపించినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. సోనామసూరి 447 క్వింటాళ్లు, సాంబమసూరి 130.18 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 685 క్వింటాళ్లు, వేరుశనగ 15.2 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపించినట్టు ఆయన తెలిపారు.

## బాలికలు పోషకాహారం తీసుకోవాలి

పద్మనాభం : బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి సూచించారు. మండలంలోని విలాస్కాన్‌పాలెంలో శనివారం 11 నుంచి 18 ఏళ్లలోపు గల ఆడపిల్లలకు రుతుక్రమం – ఆరోగ్యం, పరిశుభ్రతపై ఆమె అవగాహన కల్పించారు. బాలికలు ప్రోటీన్లు, ఐరన్ ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ప్రభావతి పాల్గొన్నారు.



బాలికలతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి

## డిగ్రీ ఫలితాల్లో లావణ్యకు 3వ ర్యాంకు

తగరపువలస : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో 2021 – 2024 విద్యా సంవత్సరానికి గాను శ్రీబాసర డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థిని బత్తుల లావణ్యకు 3వ ర్యాంకు లభించింది. చేపలుప్పాడ వద్ద గంగడపాలేనికి చెందిన లావణ్య తల్లిదండ్రులు రమణమ్మ, గురువులు కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివిస్తున్నారు. ఆమెను శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ సీహెచ్.సురేష్,ఏవో కేశవ,అధ్యాపకులు శనివారం అభినందించారు.

## పారిశుధ్య పనులు చేపట్టండి

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ ఈగలపాలెంలో రెండు నెలలుగా పారిశుధ్య పనులు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలు లేని కారణంగా నివాసాల మధ్య మురుగు నిలిచిపోయి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వెంటనే పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్, స్నేహితులు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఓ యువకుడు కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ కాపాడారు. రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల శివ అనే యువకుడు కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సతీష్, నూకరాజు, ఎం.చందు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, జి.చిన్నప్పన్న, కె.రాజు గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో స్నేహితులంతా ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

## గెడ్డలో పడిపోయిన పొక్లెయిన్



పొక్లెయిన్‌ను తీస్తున్న క్రేన్

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ గెడ్డ వద్ద పూడిక తొలగిస్తున్న పొక్లెయిన్ ఒక్కసారిగా అదుపు తప్పడంతో గెడ్డలో పడిపోయింది. ఇక్కడ శనివారం మధ్యాహ్నం గెడ్డ ఒడ్డు నుంచి వ్యర్థాలను పొక్లెయిన్ ద్వారా తొలగిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అదుపు తప్పి గెడ్డలో పడిపోయి పూర్తిగా కూరుకుపోయింది. భారీ క్రేన్లతో మూడు గంటలపాటు శ్రమించి పొక్లెయిన్‌ను బయటకు తీసుకొచ్చారు. ప్రమాదంలో డ్రైవర్ చాకచక్యంగా బయటపడ్డాడు.

## ‘లండన్ మిషన్ చర్చి స్వయం పోషక సంఘం’

తగరపువలస : సుమారు 224 సంవత్సరాల చరిత్ర కలిగిన చిట్టివలస లండన్ మిషన్ చర్చి స్వయం పోషక సంఘమని, దీని ఆస్తులన్నీ ఇతరులకు దానం చేయడానికి వీలుపడదని చర్చి ట్రస్ట్ కార్యదర్శి సుంకర కృపారావు, పాస్టర్ సుబ్బారావు జాకబ్ తెలిపారు. శనివారం వారు సంఘ సభ్యులతో కలిసి చర్చి వద్ద మాట్లాడారు. 1800 సంవత్సరంలో ఇంగ్లిష్ వారి ఆరాధనకు చర్చిని నడిపించారన్నారు. 1862 నుంచి బోధకునిగా విశాఖకు చెందిన పురుషోత్తం చౌదరిని నియమించారన్నారు. చిట్టివలస లండన్ మిషన్ చర్చికి ఎలాంటి సంబంధం లేని సీఎస్ఐ పాస్టర్ బి.జాన్ కాంతయ్య, విజయవాడకు చెందిన సీఎస్ఐ బిషప్ టి.జార్జి కొర్నోలియస్ ఇటీవల తమపైనా, సంఘ సభ్యులపైనా చేసిన ఆరోపణలు కక్ష పూరితమైనవి, అసత్య ప్రచారాలని కృపారావు అన్నారు. 23 ఏళ్లుగా సుబ్బారావు జాకబ్ తమ లండన్ మిషన్ చర్చికి పాస్టర్‌గా పనిచేస్తున్నారన్నారు. బి.జాన్ కాంతయ్య, టి.జార్జి కొర్నోలియస్ తమకు పాస్టర్ కాని, బిషప్ కాని కాదన్నారు. తమ చర్చికి, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. చర్చి ఆస్తుల విషయంపై జూన్ 18న న్యాయస్థానం నుంచి తీర్పు రానుందన్నారు. జ్యూట్ యాజమాన్యంతో కుమ్మక్కైపోయిన జాన్ కాంతయ్య, జార్జి కర్నోలియస్‌లు తమకు క్షమాపణలు చెప్పకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు ఎస్.ఆశీర్వాదం, నెహెమ్యా, డానియేల్, నిర్మలావాణి, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



# సండే క్లాసిఫైడ్స్



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.